క్లుప్తంగా

కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు (కిలో.. రూపాయల్లో...) టమోటా 29. వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 40. దొండ 28, ఆలు 20, ఉల్లి 13, గోకర 45, దోస 15, సొర 15, పొట్ల 23, అరటి 10, చిక్కుడు 60, అర్వి 35, మునగ 65, చిలగడదుంప 28, బీట్‌రూట్ 28, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 65. ఈ ధరలు సోమవారం 9 ఉదయం గంటల వరకు మాత్రమే ఉంటాయి.

మూసారంబాగ్‌లో హిందూ సామ్రాజ్య దినోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

మలక్‌పేట: హిందూ సామ్రాజ్య దినోత్సవాల్లో భాగంగా ఆదివారం దిల్‌సుఖ్‌నగర్ ఆర్‌ఆర్‌ఎస్ విభాగ్ వారు మూసారంబాగ్‌లో ర్యాలీ నిర్వహించారు. డివిజన్ బీజేపీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ర్యాలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. ఎస్‌బీఐ కాలనీ టీ-జంక్షన్ నుంచి చైతన్యపురిలోని శివాజీ విగ్రహం వరకు ర్యాలీ తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాఘువేందర్ రావు, వెంకటేష్ ప్రసాద్, బాబన్న, వెంకటేష్, దేవేందర్, ప్రవీణ్, చందు, హరీష్, కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన విద్యార్థి నేతలు

మలక్‌పేట: మంత్రి హరీష్‌రావును కోకాపేటలోని నివాసంలో కలిసినట్లు తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ తెలిపారు. మూసారంబాగ్‌లోని కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా హాస్టళ్ల భవనాలు నిర్మించాలని మంత్రికి విన్నవించామన్నారు. కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్, ముషీరాబాద్ గర్ల్స్ హాస్టల్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు మేడి నాగరాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాకతోనే అభివృద్ధి సాధ్యం

ఎల్‌బీనగర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాతనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బీఎన్‌రెడ్డి డివిజన్ పాపిరెడ్డినగర్, భవానీనగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పర్యటించి వెలుగులకు నోచుకోని వీధి దీపాలు, పడకేసిన పారిశుధ్యం, పచ్చదనం కరువైన పార్కులు, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు వంటి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. త్వరలో కాలనీ సమస్యలన్నింటినీ ఎంపీ రేవంతరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదుకు కృషి చేస్తానని ఆయన కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. సోనియా గాంధీ ప్రత్యేక శ్రద్ధతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మకుటం సదాశివుడు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నర్సిరెడ్డి, కృష్ణ, సురేందర్, శ్రీపాల్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యేష్టాభిషేక మహోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో ఆదివారం జ్యేష్ట మాస జ్యేష్ట నక్షత్ర యుక్త జ్యేష్టాభిషేకం మహోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా శ్రీ సూక్త హవనము, ఏకోత్తర సహస్ర కలశాభిషేక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమా సురేష్, మాజీ చైర్మన్ తెలుకుంట్ల రమేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయితే అంజయ్యగుప్తా, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతిరావు, చిలుక ఉపేందర్‌రెడ్డి, గోవింద్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సురక్ష ర్యాలీలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, వాహనలు

తెలంగాణ పోలీస్.. సేవలు భేష్

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో ఘనంగా సురక్షా దినోత్సవం



బెలూన్లను ఎగురవేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, సీపీ చౌహాన్

నాగోలు: దేశంలో నంబర్ వన్‌గా తెలంగాణ పోలీస్ నిలుస్తున్నారని, శాంతి భద్రత పరిరక్షణలో మన పోలీస్‌లు ముందున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనరేటర్ పరిధిలో సురక్ష దినోత్సవాన్ని ఆదివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్‌తో కలిసి ఎల్‌బీనగర్‌లో సీపీ క్యాంప్ నుంచి ఉప్పల్ నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. 2014కు ముందు ఎట్లుండే తెలంగాణ సీఎం కేసీఆర్ సారథ్యంలో ఇప్పుడు ఎట్లా మారిందో ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. స్వరాష్ట్రంలో నూతనంగా పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ జోన్లు, కమిషనరేట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత దగ్గరగా ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. సీపీ నుంచి మొదలుకొని హోం గార్డు వరకు నేడు ర్యాలీలో పాల్గొని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. తాళం వేయనిది ఒక పోలీస్ స్టేషన్ మాత్రమేనని, రాత్రింబవళ్లు ప్రజల కోసం పనిచేస్తూ అందరూ ప్రశాంతంగా నిద్రపోయేలా పోలీసులు పనిచేస్తున్నారన్నారు. శాంతి భద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం అని, తద్వారా రాష్టానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ కూడా పోలీస్ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని, నూతన ఉద్యోగాలతో పాటు, అధునాతన వాహనాలు సమకూర్చారన్నారు. అభివృద్ధికి అంకితం అవుదాం.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో బాగస్వాములు అవుదాం అని మంత్రి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ భవనం దేశానికి తలమానికం అని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని, రాష్ట్ర పోలీసు శాఖ సమర్థవంతమైన సేవలను అందిస్తుందన్నారు. మహిళల భద్రతకు షీటీమ్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో షీటీమ్స్ ద్వారా మహిళలకు భరసా కల్పిస్తున్నామని తెలిపారు. స్వరాష్ట్రంలో నూతనంగా పోలీస్ స్టేషన్లు, ఏసీపీ, డీసీపీ జోన్లు, కమిషనరేట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత దగ్గరగా ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను తీసుకువచ్చారని అన్నారు. త్రివర్ణ బెలూన్లను గాలిలో ఎగురవేసి భారీ పోలీస్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమలలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, రాజేష్ చంద్ర, శ్రీనివాస్, శ్రీబాల, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు



మాట్లాడుతున్న జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగినేని కృష్ణవేణి ధ్వజమెత్తారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆగడాలు భరించలేక తెలంగాణ భవన్‌లో మహిళ ఆత్మహత్య చేసుకుందని, దీనికేనా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుందని ప్రశ్నించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని ఎద్దేవచేశారు. గ్రూప్-1 పేపర్ లీకేజీ ఘనటపై న్యాయ విచారణకు భయపడి కేవలం సిట్ విచారణతో సరిపెట్టడం ప్రభుత్వ డొల్లతనానిని నిదర్శనమన్నారు. గ్రూప్-1 పేపర్ లీకేజీని కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై టెన్త్ హిందీ పేపర్ లీకేజీలో పాత్ర ఉందని డ్రామాలు ఆడారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు నందికొండ గీతారెడ్డి, పోరెడ్డి కవితారెడ్డి, కాట విజయ, వర్కాల వీణ, జక్క గీతారెడ్డి, కొండూరు లక్ష్మి, కర్నాటి మాధవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తా

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పార్కుల అభివృద్ధికి కృషిచేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలోని పార్కులో స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హనుమాన్‌నగర్ పార్కును అభివృద్ధి పరచడంతో పాటు పార్కులో ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కల్పనా రెడ్డి, కాలనీ ప్రతినిధులు గంధం శ్రీనివాస్, ఇబ్రహీం, నాగయ్య, మైకేల్ పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



హస్తినాపురం: వ్యాయామాలు, ఆసనాలు ప్రాణాయామాలు ప్రతి నిత్యం సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని శ్రీ సిద్ధిరాజ్ తపోద నగిరి స్వామీజీ అన్నారు. మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీహాల్‌లో షిరిడీసాయి అష్టాంగ యోగా సాధన ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధిరాజ్ గురూజీ మాట్లాడుతూ.. యోగా సాధన నేర్చుకోవడానికి వయసుతో ప్రమేయం లేదని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగసాదన ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. యోగా శిక్షణ నిర్వాహకులు ఇస్మాయిల్ గురూజీ మాట్లాడుతూ.. 15 రోజుల పాటు సాగే యోగా శిక్షణ తరగుతుల్లో వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామాలు, సూర్యనమస్కారాలు, ధ్యానం నేర్పిస్తామని అన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని మక్తల్ గ్రామానికి చెందిన శశిరేఖ అనారోగ్య కారణంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలవగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.30 వేల చెక్కును ఆదివారం నాగోలులోని శ్రీనివాస్‌గుప్తా క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌బీ కార్యదర్శి మహేష్, అనిపులి వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఆదివారం మూసారంబాగ్ డివిజన్ ఎస్‌బీహెచ్ కాలనీ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్స్ జరిగిన సమావేశంలో నూతన కమిటీ చైర్మన్‌గా సామ ప్రభాకర్‌రెడ్డి, ప్రెసిడెంట్‌గా కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్ జాదవ్, జనరల్ సెక్రటరీగా సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్లుగా గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డి. వెంకటేశం, జాయింట్ సెక్రటరీలుగా కె. వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాసరాజు, ట్రెజరరీగా ఎం. స్వామిగౌడ్, ఈసీ మెంబర్లుగా ఎంఎస్ రావు, పి. కృష్ణకిరణ్, ఏ.శ్రీనివాస్, బి. సింహాచలం, జగన్మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు. కరెడ్ల శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహించారు. ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. అసోసియేషన్ మరింతగా బలోపేతం చేసి.. క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి కృషి చేస్తామన్నారు.

ముగిసిన అష్టాదశ వార్షికోత్సవాలు



పూర్ణాహూతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మన్సూరాబాద్: శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయ అష్టాదశ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడు రోజులు పాటు వార్షికోత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహూతి కార్యక్రమాన్ని, 11 గంటలకు మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, 12 గంటలకు అమ్మవారి శేష వస్త్రాల వేలం పాట నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రవి, మురళి, రమేష్‌కుమార్, కేశవులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో కాలనీలలో పలు అభివృద్ధి పనులకు ఆమె కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో ఈ ప్రాంతంలో నూతనంగా వచ్చిన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, లింక్ రోడ్లతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ డీసీ కృష్ణయ్య, బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, మురుకుంట్ల అరవింద్, సాజీద్, దుబ్బక శేఖర్, మహ్మద్, వాజీద్ పటేల్, సునితరెడ్డి, అనురాధ, స్వప్నరెడ్డి, హైమాద్, పాష పాల్గొన్నారు.

సైదాబాద్ ఠాణాలో సురక్షా దినోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో పోలీసులు ప్రజలకు చేరువవడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో సురక్షా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బలాల పోలీసులు, పీస్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ.. పీస్ కమిటీ సభ్యులు ప్రజలకు పోలీసులకు వారధిలా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్, సైదాబాద్ కార్పొరేటర్ అరుణ, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి పాల్గొన్నారు.

హస్తినాపురం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



మంత్రి కేటీఆర్‌తో కార్పొరేటర్ సుజాతనాయక్ దంపతులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రి కేటీఆర్‌కు కార్పొరేటర్ సుజాతనాయక్ దంపతులు విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రశాంత్‌నగర్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను వారు కలిసి రోజురోజుకూ తమ డివిజన్‌లో నూతనంగా కాలనీలు పెరుగుతున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగునంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అధిక నిధులు కావాలని, అందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని సుజాతనాయక్ కోరారు. వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ డివిజన్‌ను సమగ్రంగా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తానని హామీ యిచ్చినట్లు కార్పొరేటర్ వెల్లడించారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని స్నేహపూరి కాలనీలో యమున దేవి పాలి క్లినిక్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత వైద్య సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ యమున దేవి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేస్తున్నామని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి పవనగిరికాలనీ ఫేజ్-1లో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ఆదివారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు జీహెచ్‌ఎంసీకి చెల్లిస్తున్న టాక్సులతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కాలనీలో మిగిలిపోయిన పనులకు నిధులు కేటాయింపజేసి పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిలుగౌడ్, కొండల్‌రెడ్డి, సోమనాథ్, సాయిరాంగౌడ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న గోపాలరావు గ్యాస్ పంపిణీ దారులు

సైదాబాద్: వంట గ్యాస్ వాడకంలో మహిళలు తగిన జాగ్రత్తలు పాటించాలని గోపాలరావు ఎంటర్‌ప్రైజెస్ హెచ్‌పీ గ్యాస్ పంపిణీ దారుల ప్రతినిధి అనిత సూచించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం ఐఎస్‌సదన్ చౌరస్తా వద్ద సంస్థ కార్యాలయంలో మహిళా వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంట గ్యాస్ వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంస్థ ప్రతినిధులు వివరించారు. సిలిండర్ నుంచి స్టౌవ్‌కు గ్యాస్ సరఫరా చేసే రబ్బరు ట్యూబ్‌ను తరచూ పరిశీలిస్తుండాలని తెలిపారు. వాడకం పూర్తయిన తరువాత ప్రతీసారి సిలిండర్ ఆఫ్ చేయాలని సూచించారు. సురక్షిత పద్ధతుల్లో గ్యాస్‌ను వాడటం ద్వారా అనుకోని సంఘటనలు చోటుచేసుకోవని వారు మహిళలకు వివరించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ జలేందర్‌రెడ్డి

హస్తినాపురం: నేరాలను అరికట్టి శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ప్రజలు తమ పూర్తి సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉందని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సురక్షదిన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ జలేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రైం ప్రివెన్షన్, క్రైం డిటెక్షన్, శాంతి భద్రతలు సక్రమంగా ఉండేవిధంగా సమాజంలో జరుగుతున్న సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగే విధంగా పోలీసు శాఖ చేపడుతున్న చర్యల గురించి ప్రజలకు ఈ సందర్భంగా సీఐ వివరించారు.

భర్త వేధింపులకు తాళలేక ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నాగోలు: భార్యాభర్తల గొడవతో మనస్తాపం చెందిన ఓ మహిళ యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందని ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వీరేందర్- శారద (40) దంపతులు. వీరేందర్ కిరాణాం షాపు నిర్వహిస్తుంటాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం శారదను వేధింపులకు గురి చేసేవాడు. ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. గత 20 రోజుల గొడవ జరగడంతో శారద తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న యాసిడ్ తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. వీరేందర్ అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడడంతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని శారద తల్లి భాగ్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.